సాక్షి
అనంతపురం

సోమవారం । 8 । మే । 2023



అవార్డుల 'సేద్యం'

'అనంత'కు చెందిన చంద్రకాంత్ తీసిన 'సేద్యం' చిత్రం విడుదలకు ముందే అవార్డుల పంట పండిస్తోంది. 8లో



'తపాలా' ఎన్నికలు ప్రశాంతం

అనంతపురం డివిజన్ తపాలా ఉద్యోగుల కో ఆపరేటివ్ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. 8లో

గరిష్టం/కనిష్టం
36.8°/21.2°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. మధ్యాహ్న సమయంలో ఉక్కపోత అధికంగా ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

20 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలోని 20 మండలాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 9.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కుందుర్పిలో 48.6 మి.మీ, యాడికి 43.6, గుమ్మఘట్ట 35.4, శింగనమల 23.4, ఆత్మకూరు 17.2, అనంతపురం 16.4, గార్లదిన్నె 15.6, నార్పల 14.2, పామిడి 12.4, కూడేరు 11.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. మే నెల సాధారణం 36.7 మి.మీ కాగా... ఇప్పటికే 55.5 మి.మీ నమోదైంది.

రెండు రోజులు జిల్లాకు వర్ష సూచన

అనంతపురం అగ్రికల్చర్: నైరుతి బంగాళాఖాతంలో సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్లు, 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సోమవారం నాటికి అల్పపీడనం, మంగళవారం నాటికి తుపానుగా మారే అవకాశం ఉందని రేకులకుంటలోని వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక బులెటిన్ విడుదల చేశారు. రాగల రెండు రోజులు జిల్లాకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షసూచన ఉందన్నారు. మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు నమోదవుతాయని తెలిపారు. రైతులు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

హనుమద్ వాహనంపై లక్ష్మీనారసింహుడు



ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం హనుమద్వాహనంపై నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. నమో నారసింహా అంటూ భక్తులు ఉత్సవ రథాన్ని ముందుకు లాగారు. కార్యక్రమంలో ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకనాథాచార్యులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహకం



జీర పంటను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీధర్

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహకం అందిస్తోందని ప్రత్యేక అధికారి, ఉద్యానశాఖ కమిషనర్ శ్రీధర్ పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో దెబ్బతిన్న పంటలను రెండో రోజు ఆదివారం ఆయన పరిశీలించారు. బుక్కరాయసముద్రం, ధర్మవరం రూరల్ మండలాల్లో అరటి, ద్రాక్ష, సపోట, బొప్పాయి, టమాట, కాకర తదితర పంటలను పరిశీలించి, నిబంధనల మేరకు ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్‌సబ్సిడీ (పెట్టుబడిరాయితీ) రూపంలో పరిహారం అందజేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. ఆదాయం వచ్చే పంటలు సాగు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్పెషల్ ఇన్‌చార్జ్, కమిషనరేట్ గుంటూరు డీడీహెచ్ ధర్మజ, ఉద్యానశాఖ ఇన్‌చార్జ్ డీడీ నరసింహారావు, ఏపీ ఎంఐపీ పీడీ జి.ఫిరోజ్‌ఖాన్, టెక్నికల్ హెచ్ఓ రత్నకుమార్, శ్రీ సత్యసాయి జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, బీకేఎస్ మండల ఉద్యానశాఖ అధికారి శైలజ, ఆర్బీకే సిబ్బంది నదియా, నరసింహ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఆసియా బీచ్ వాలీబాల్ జట్టుకు ఎంపిక



నరేష్

అనంతపురం: ఆసియా బీచ్ వాలీబాల్ చాంపియన్‌షిప్ టోర్నీ జూన్ 23 నుంచి 26వరకు జరగనుంది. భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న జట్టుకు నార్పల మండలానికి చెందిన నరేష్ ఎంపికయ్యాడు. నరేష్ హైదరాబాద్‌లో కస్టమ్స్ విభాగంలో అధికారిగా పనిచేస్తున్నాడు.

సర్కారు 'ఆణిముత్యాలు'

'ప్రభుత్వ స్కూళ్లలో ట్రైన్డ్ టీచర్లు కావడంతో పిల్లలకు మార్కులే కాకుండా నైపుణ్యాలు పెంపొందించేలా చేస్తారు. సహజంగా ప్రభుత్వ స్కూళ్లు అంటే తక్కువ అంచనా వేస్తారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ముఖ్యంగా ఈ మూడేళ్లలో ప్రభుత్వ స్కూళ్లు మరింత నాణ్యతగా ఉన్నాయి. ఇక్కడ చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఢోకా ఉండదు'

– ఇదీ అనంతపురం నగరంలోని పొట్టిశ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి 588 మార్కులు సాధించిన విద్యార్థి సాయి అక్షిత్ తండ్రి కడియాల విశ్వనాథం అభిప్రాయం.

- పది ఫలితాల్లో కార్పొరేట్‌కు దీటుగా సత్తా
- ప్రభుత్వ యాజమాన్యాల స్కూళ్లలో కడియాల సాయి అక్షిత్ 588 మార్కులతో జిల్లా ఫస్ట్
- 587 మార్కులతో రెండో స్థానంలో నిలిచిన కరణం రక్షిత, కండ్లపల్లి హాసిని
- ప్రభుత్వ స్కూళ్లలో గతేడాదికంటే గణనీయంగా పెరిగిన ఉత్తీర్ణత



588 మార్కులు సాధించిన కడియాల సాయి అక్షిత్‌కు బొకే అందజేస్తున్న తల్లిదండ్రులు



తల్లిదండ్రులు, సోదరుడితో 587 మార్కులు సాధించిన కండ్లపల్లి హాసిని

ప్రభుత్వ స్కూళ్లలో 580, ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు

విద్యార్థి పేరు	స్కూల్	మార్కులు
కడియాల సాయి అక్షిత్	పొట్టిశ్రీరాములు స్కూల్, అనంతపురం	588
కరణం రక్షిత	జెడ్పీహెచ్ఎస్ తెనగల్, కుందుర్పి	587
కండ్లపల్లి హాసిని	రెసిడెన్షియల్ స్కూల్, గుత్తి	587
ఎ.హమీదానస్రీన్	రెసిడెన్షియల్ స్కూల్, గుత్తి	586
నాగరదన్ను పావని	రెసిడెన్షియల్ స్కూల్, గుత్తి	586
గణేష్ ప్రమదమణి	ఎస్కేడీ స్కూల్, అనంతపురం	585
మడుగొండే వెంకటేష్	మోడల్ స్కూల్, రాయదుర్గం	585
కందుకూరు జశ్వంత్‌రెడ్డి	జెడ్పీహెచ్ఎస్, కడవకల్లు	584
శివగాని లోకేశ్వరి	మోడల్ స్కూల్, చిలమకూరు	584
మిట్టే జగదీష్	మోడల్ స్కూల్, రాయదుర్గం	583
జనగాని స్పందన	జెడ్పీహెచ్ఎస్, తిమ్మంపల్లి	583
డి.మధుసూదన్	రెసిడెన్షియల్ స్కూల్, బి.పప్పూరు	583
పి.వంశీకృష్ణరెడ్డి	జెడ్పీహెచ్ఎస్, కాసేపల్లి	583
జ్యోతికుమారి సింగ్	మోడల్ స్కూల్, తాడిపత్రి	582
సి.ప్రతీక్ష	రెసిడెన్షియల్ స్కూల్, గుత్తి	582
రాఘవరెడ్డి తనూష	జెడ్పీహెచ్ఎస్ తిమ్మంపల్లి	581
అట్టే అనురాధ	రెసిడెన్షియల్ స్కూల్, గుత్తి	580

జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్ల వివరాలు

ప్రైవేట్ ఎయిడెడ్ స్కూళ్లు	12
ఎంజేపీఏపీబీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లు	4
ప్రభుత్వ స్కూళ్లు	13
కేజీబీవీలు	32
మున్సిపల్ స్కూళ్లు	20
మోడల్ స్కూళ్లు	15
ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూళ్లు	225
ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు	3
ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లు	8
ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లు	6
జెడ్పీ స్కూళ్లు	235

రాప్తాడురూరల్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అదరగొట్టారు. వంద రోజుల 'అనంత సంకల్పం', స్లిప్పు టెస్టులు, ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని పదో తరగతి విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయడంతో కార్పొరేట్‌కు ఏమాత్రమూ తీసిపోని విధంగా సత్తా చాటారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో లక్షలాది రూపాయలు డొనేషన్లు, ఫీజులు, యూనిఫాం, పుస్తకాల కోసం ఖర్చు చేస్తుంటారు. పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేస్తూ చదువు చెబుతుండగా.. అందుకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో రాణించారు. ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలలకు సంబంధించి అనంతపురంలోని పొట్టిశ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థి కడియాల సాయి అక్షయ్ 588 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే కుందుర్పి మండలం తెనగల్లు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని కరణం రక్షిత 587, గుత్తి రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థిని కండ్లపల్లి హాసిని 587 మార్కులతో రెండోస్థానంలో నిలిచారు.

గతేడాదికంటే బాగా పెరిగిన ఉత్తీర్ణత..

ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో గతేడాదికంటే ఈసారి ఫలితాల శాతం బాగా పెరిగింది. విద్యాశాఖ అధికారులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని టీచర్లు చెబుతున్నారు. ఏపీ మోడల్ స్కూళ్లలో గతేడాది 58.32 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈసారి 74.89 శాతం సాధించారు. ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లలో గతేడాది 82.94 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈసారి 91.82 శాతం సాధించారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ స్కూళ్లలో గతేడాది 61.03 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈసారి 85.23 శాతం సాధించారు. ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లలో గతేడాది 19.50 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈసారి 51.34 శాతం సాధించారు. కేజీబీవీల్లో గతేడాది 36.77 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈసారి 58.50 శాతం సాధించారు. జెడ్పీ స్కూళ్లలో గతేడాది 27.36 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈసారి 47.40 శాతం సాధించారు. మునిసిపల్ స్కూళ్లలో గతేడాది 33.30 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈసారి 51.01 శాతం సాధించారు. ప్రభుత్వ స్కూళ్లలో గతేడాది 31.07 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈసారి 47.50 శాతం సాధించారు.

రెండు సబ్జెక్టుల్లోనే 6,535 మంది ఫెయిల్..

జిల్లాలో మొత్తం 10,012 మంది విద్యార్థులు ఫెయిల్ అయితే.. ఇందులో 6,535 మంది రెండు సబ్జెక్టుల్లో తప్పారు. గణితం పరీక్షలో 4,235 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఇక సైన్స్ పరీక్ష 2,300 మంది విద్యార్థులు తప్పారు. ఈ రెండు సబ్జెక్టులు పాసై ఉంటే జిల్లా సగటు 80 శాతానికి మించేదని టీచర్లు విశ్లేషిస్తున్నారు.

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే..

అనంతపురం నగరానికి చెందిన కడియాల విశ్వనాథం, కడియాల రామకుమారి దంపతులకు ఇద్దరు సంతానం. కూతురు కడియాల అక్షిత డిగ్రీ చదువుతోంది. కుమారుడు కడియాల సాయి అక్షిత్ పొట్టి శ్రీరాములు పాఠశాలలో చదువుతున్నాడు. తనకు 588 మార్కులు రావడంపై సాయిక్షిత్ మాట్లాడుతూ 'పరీక్షలకు టీచర్లు పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసి ప్రోత్సహించారు. తరచూ పరీక్షలు పెడుతూ వెనుకబడిన అంశాలపై ప్రత్యేక తర్ఫీదు ఇచ్చారు. ఈ మార్కులు ఊహించినవే. ఐఏఎస్ కావడమే లక్ష్యం' అని చెప్పాడు.

చాలా సంతోషంగా ఉంది

గుంతకల్లు మండలం ఇమాంపురం గ్రామానికి చెందిన సుంకన్న, సరళ దంపతులు. సుంకన్న వ్యవసాయ కూలి పనులు చేస్తుండగా, భార్య రజక వృత్తి చేసుకుంటోంది. ఇద్దరూ నిరక్షరాస్యులే. వీరికి కుమారుడు, కూతురు సంతానం. కుమారుడు ఆర్డీటీ సహకారంతో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కూతురు కండ్లపల్లి హాసిని గుత్తి బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతూ 587 మార్కులతో జిల్లాలో రెండోస్థానంలో నిలిచింది. తల్లిదండ్రులు మాట్లాడుతూ 'మా ఇద్దరు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి మంచి మార్కులు తెచ్చుకున్నారని, మా బిడ్డ జిల్లాలో రెండోస్థానంలో నిలిచిందని అందరూ మాట్లాడుకుంటుంటే చాలా సంతోషంగా ఉంద'ని చెప్పారు.

ప్రత్యేక శిక్షణ ఇచ్చారు



కుందుర్పి మండలం తెనగల్లు జెడ్పీహెచ్ఎస్‌లో చదువుతూ 587 మార్కులతో జిల్లాలో రెండోస్థానంలో నిలిచింది కరణం రక్షిత. తల్లిదండ్రులు శ్రీదేవి, మధుసూదన్‌రావు. ఇద్దరు ఆడపిల్లలు సంతానం. రక్షిత పెద్దమ్మాయి. చిన్నమ్మాయి 8వ తరగతి చదువుతోంది. రక్షిత మాట్లాడుతూ 'స్కూల్ టీచర్లు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. డైలీ రౌండ్ టెస్టులు పెట్టడం కలిసొచ్చింది.. అనంత సంకల్పం మెటీరియల్ చాలా ఉపయోపడింది. ఐఐటీలో సీటు సాధించి మండలానికి పేరు తీసుకొస్తా' అని చెప్పింది.

ఎంటెక్‌లో నూతన కోర్సు

- జేఎన్‌టీయూఏలో స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ కోర్సు
- కోర్సు నిర్వహణకు రోడ్లు, రవాణా మంత్రిత్వ శాఖ ఆర్థికసాయం
- మొత్తం రూ.4 కోట్ల ప్రాజెక్ట్ నిర్వహణకు నిధులు విడుదల



అనంతపురం: నిర్మాణరంగం వేగవంతంగా అభివృద్ధి చెందుతోంది. రహదారుల నిర్మాణం విస్తారంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో టన్నెల్స్, బ్రిడ్జి నిర్మాణంలో నిపుణుల అవసరం ఏర్పడింది. అయితే టన్నెల్స్, బ్రిడ్జి నిర్మాణంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారి కొరత అధికంగా ఉంది. ఈ క్రమంలో భారత ప్రభుత్వ రోడ్లు, రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఎంటెక్ కోర్సు నిర్వహించడానికి ఆర్థిక చేయూత ప్రకటించింది. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఎంటెక్ స్ట్రక్చరల్ (బ్రిడ్జి, టన్నెల్స్) కోర్సు ప్రవేశపెట్టారు. 2023–24 విద్యా సంవత్సరం నుంచే ఈ కోర్సును అమలు చేస్తున్నారు. దేశంలో ఎంటెక్ స్ట్రక్చరల్ (బ్రిడ్జి, టెన్నల్స్) కోర్సు అమలు చేస్తున్న తొలి వర్సిటీగా జేఎన్‌టీయూ అనంతపురానికి ఖ్యాతి దక్కింది. త్వరలో ఏపీ పీజీ ఈసెట్–2023 నిర్వహించనున్నారు. ఇందులో ప్రతిభ కనబరచి ర్యాంకులు దక్కించుకున్న వారికి సీట్లు కేటాయించనున్నారు.

ప్రత్యేకంగా ల్యాబ్..

తొలి 5 సంవత్సరాలు ఎంటెక్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ కోర్సు నిర్వహణకు భారత రోడ్లు రహదారుల మంత్రిత్వ శాఖ చేయూతనిచ్చింది. ఇందుకు రూ.4 కోట్ల నిధులు మంజూరు చేసింది. స్ట్రక్చరల్ ల్యాబ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. ల్యాబ్ నిర్వహణకు ఏడాదికి రూ.25 లక్షలు ఖర్చు చేయనున్నారు. మొత్తం 25 సీట్లు కేటాయించారు. వేసవి సెలవుల్లో ఇంటర్న్‌షిప్‌కు అయ్యే మొత్తం, ఫ్యాకల్టీ జీతాలు, ప్రత్యేక ఎన్ఐటీ, ఐఐటీ ప్రొఫెసర్లకు భారత రహదారుల మంత్రిత్వశాఖ భరించనుంది. కోర్సు అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తారు.

తొలి వర్సిటీగా గుర్తింపు



దేశంలో ఎంటెక్ స్ట్రక్చరల్ కోర్సు నిర్వహిస్తున్న తొలి యూనివర్సిటీగా జేఎన్‌టీయూఏకు గుర్తింపు రావడం గర్వకారణం. ప్రస్తుత పరిస్థితుల్లో నిర్మాణ రంగం వేగవంతంగా అభివృద్ధి చెందుతోంది. ఈ కోర్సు మంజూరుకు సహకరించిన భారత రహదారుల మంత్రిత్వశాఖ, ఏపీ ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాం. –ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం

డిమాండ్ ఉన్న కోర్సు



ఎంటెక్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ కోర్సులో 2023–24 విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు నిర్వహిస్తున్నాం. మొత్తం 25 సీట్లు కేటాయించారు. కోర్సు పూర్తి చేసిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. – ప్రొఫెసర్ సి.శశిధర్, ఎంటెక్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్

బళ్లారిలో తమ్ముళ్ల ప్రలోభాల పర్వం

- ఓటర్లకు డబ్బు పంచుతూ పోలీసులకు చిక్కిన వైనం
- కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ప్రచారానికి డీల్ కుదుర్చుకున్న టీడీపీ ముఖ్యనేత



సాక్షి ప్రతినిధి, అనంతపురం: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ తేదీ దగ్గర పడేకొద్దీ ఓటర్లను ప్రసన్నం చేసుకునేలా ప్రలోభాల పర్వం మొదలెట్టారు. బళ్లారి సిటీలో తెలుగు తమ్ముళ్లు కొందరు కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేలు చొప్పున వార్డుల్లో పంచుతూ ఆదివారం పోలీసులకు చిక్కారు. ఈ విషయం అనంతపురం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఆ పార్టీలో ముఖ్యనాయకుడు ఒకరు కాంగ్రెస్ అభ్యర్థితో రూ.2 కోట్లకు డీల్ కుదుర్చుకుని ప్రచారంలో దింపారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. రాయదుర్గం నియోజకవర్గానికి బళ్లారి ఆనుకుని ఉండడం, ఈ ప్రాంతం నుంచి చాలా మంది అక్కడికెళ్లి స్థిరపడడం లాంటి కారణాలు డీల్‌కు కలిసొచ్చాయని తెలుస్తోంది.

కుమ్మక్కు రాజకీయాలు వెన్నతో పెట్టిన విద్య

కుమ్మక్కు రాజకీయాలు చేయడం టీడీపీ నాయకులకు వెన్నతో పెట్టిన విద్యగా మారింది. 2019 ఎన్నికల సమయాన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కాంగ్రెస్‌తో దోస్తీ కట్టారు. వారి పంచన చేరాక పార్టీ మరింత పతనమైపోవడంతో బాబుతో బంధం కటీఫ్ చేసుకున్నారు. అప్పట్లో రాజకీయ అస్తిత్వం కోసం చంద్రబాబు బీజేపీని తూర్పారబట్టారు. మళ్లీ ఊసరవెల్లి రాజకీయాలు చేస్తూ బీజేపీ, జనసేన పార్టీలకు దగ్గరయ్యేలా మంతనాలు సాగిస్తున్నారు. అయితే బళ్లారిలో ముఖ్య నాయకుడి కనుసన్నల్లో కొందరు టీడీపీ నాయకులు కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ప్రచారం చేస్తూ మరోలా కనిపించారు. ఈ విషయం అనంతపురం జిల్లా టీడీపీ నేతల్లో కాస్త హాట్ టాపిక్‌గా మారింది. అధినేత ఒకలా, దిగువ నేతలు మరోలా వ్యవహరిస్తుండడం సరైన తీరుకాదని మండిపడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ప్రచారం చేయడం పట్ల టీడీపీ నాయకులు కొందరు జీర్ణించుకోలేకపోతున్నారు.

నయనానందకరం.. పుష్పయాగం



ధర్మవరం అర్బన్: ధర్మవరంలో కొలువైన శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామికి ఆదివారం పుష్పయాగం కనులపండువగా సాగింది. 28 రకాల పుష్పాలను స్వామివారికి అర్చకులు సమర్పించారు. సాయంత్రం శయనోత్సవంతో స్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.





అనంతపురం జూనియర్ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు, ఎస్ఎస్‌బీఎన్ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థినులు



హాజరు నమోదు చేస్తున్న సిబ్బంది



విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రశాంతంగా నీట్

అనంతపురం: వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన నీట్ (జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష) ఆదివారం అనంతపురంలో ప్రశాంతంగా జరిగింది. ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల కేంద్రంలో 936 మందికి గాను 920 మంది, ఎస్కేయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో 600 మందికి గాను 587 మంది, కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల (ఉమెన్)లో 504 మందికి గాను 494 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాయ్స్)లో 408 మందికి గాను 401 మంది, రాజేంద్ర మునిసిపల్ ఉన్నత పాఠశాలలో 360 మందికి గాను 350 మంది, కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు)లో 177 మందికి గాను 172 మంది పరీక్షకు హాజరైనట్లు సిటీ కోఆర్డినేటర్ ఎస్.కరీం ఖాన్ తెలిపారు. మొత్తం 2,985 మందికి గాను 2924 మంది (97.96 శాతం) పరీక్ష రాశారన్నారు. 61 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. నిర్దేశించిన సమయం కంటే విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రంలోకి వచ్చారన్నారు.

క్లుప్తంగా

టెంపోను ఢీ కొన్న లారీ

- 10 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



దెబ్బతిన్న టెంపో

పామిడి: టెంపోను లారీ ఢీకొన్న ఘటనలో పది మంది గాయపడ్డారు. వీరిలో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా, ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. పోలీసులు తెలిపిన మేరకు... బెంగళూరుకు చెందిన పది మంది శనివారం రాత్రి టెంపోలో మంత్రాలయానికి బయలుదేరారు. అర్ధరాత్రి పామిడి మండలం రామరాజుపల్లి వద్ద ఉన్న రిలయన్స్ పెట్రోల్ బంకు వద్దకు చేరుకోగానే ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన రాజస్తాన్‌కు చెందిన లారీ ఢీ కొంది. లారీలో డీజిల్ వేయించుకునేందుకు డ్రైవర్ రాంగ్ రూట్‌లో ప్రవేశించినట్లు తెలిసింది. ఘటనలో టెంపో ధ్వంసమైంది. టెంపోలో ప్రయాణిస్తున్న పది మంది గాయపడ్డారు. వీరిలో ఆరుగురికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను హుటాహుటిన కర్నూలు సర్వజనాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పామిడి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

పామిడి: రెండో విడత ప్రయత్నంలోనూ పదో తరగతి ఉత్తీర్ణత కాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడిలోని ఎద్దులపల్లి రోడ్డులో నివాసముంటున్న రాజు కుమారుడు శ్రీనివాసులు (17) గత ఏడాది పదో తరగతి పరీక్ష రాశాడు. అందులో ఉత్తీర్ణత సాధించకపోవడంతో ఈ ఏడాది మరోసారి పరీక్ష రాశాడు. శనివారం విడుదలైన ఫలితాలను పరిశీలించుకున్న శ్రీనివాసులు తాను ఫెయిల్ అయినట్లు తెలుసుకుని మనస్తాపానికి లోనై ఊజీ మాత్రలు మింగాడు. సాయంత్రం అపస్మారక స్థితిలో పడి ఉన్న కుమారుడిని గమనించిన తల్లిదండ్రులు హుటాహుటిన అనంతపురంలోని వైద్యశాలకు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక శనివారం రాత్రి శ్రీనివాసులు మృతి చెందాడు. ఘటనపై పామిడి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సంతల ద్వారా రూ.3.14 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాలు, పశువుల సంతల ద్వారా రూ.3.14 లక్షలకు పైచిలుకు ఫీజు వసూలైనట్లు యార్డు చైర్మన్, ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు.



అనంత యువకుడి.. అవార్డుల సేద్యం

'అనంత' నేలకు పవరెక్కువ. అరుదైన ఖనిజాలు ఇస్తుంది. అపురూపమైన పంటలూ పండిస్తుంది. సాహితీ పరిమళాలను వెదజల్లుతుంది. మట్టిలో మాణిక్యాలనూ వెలికితీస్తుంది. ఈ నేలపై పుట్టిన వారెందరో వివిధ రంగాల్లో సత్తా చాటుతున్నారు. సినీరంగంలోనూ ప్రతిభ నిరూపించుకుంటున్నారు. అలాంటి వారిలో చంద్రకాంత్ పసుపులేటి ఒకరు. లఘుచిత్రాల (షార్ట్ ఫిలిమ్స్) ద్వారా సత్తా చాటిన ఈ యువకుడు ఇప్పుడు సినీ 'సేద్యం' చేయడానికి సిద్ధమయ్యాడు. - అనంతపురం డెస్క్:



అనంత ఫిలిం ఫెస్టివల్‌లో అవార్డు అందుకుంటున్న చంద్రకాంత్ పసుపులేటి (వృత్తంలో)

- దర్శకుడిగా రాణిస్తున్న చంద్రకాంత్ పసుపులేటి
- పలు షార్ట్ ఫిలిమ్‌ల రూపకల్పన
- 'సేద్యం'తో సినీ ఎంట్రీ
- ఇప్పటికే పలు అవార్డులు కైవసం



'సేద్యం' చిత్రీకరణలో చంద్రకాంత్ పసుపులేటి, కెమెరామెన్ విష్ణువర్ధన్‌రెడ్డి



సేద్యం చిత్రంలోని ఓ సన్నివేశానికి దర్శకత్వం వహిస్తున్న చంద్రకాంత్ పసుపులేటి (ఫైల్)

ధర్మవరానికి చెందిన చంద్రకాంత్ పసుపులేటి తండ్రి శ్రీనివాసులు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో కొత్తచెరువు మండల టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. తల్లి పద్మావతి ధర్మవరం ఆర్టీసీ డిపోలో కండక్టర్. ప్రస్తుతం వీరు అనంతపురంలో నివాసముంటున్నారు. ఎంబీఏ చదివిన చంద్రకాంత్‌కు సినీ రంగంలో దర్శకుడిగా రాణించాలన్నది కోరిక. ఎలాంటి సినీ నేపథ్యమూ లేకపోయినప్పటికీ పట్టుదలతో అడుగులు ముందుకు వేశారు. షార్ట్‌ఫిలిమ్‌ల ద్వారా ప్రస్థానాన్ని ప్రారంభించాడు. ఇప్పటివరకు 11 షార్ట్ ఫిలిమ్స్ రూపొందించాడు. సామాజిక అంశాలు ఇతివృత్తంగా రూపొందించిన ఈ షార్ట్ ఫిలిమ్స్ అన్నీ ప్రశంసలు అందుకున్నాయి. తెలంగాణ ప్రాంతం నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లి.. అక్కడ వారు పడుతున్న ఇబ్బందులపై రూపొందించిన 'గల్ఫ్ గోస' షార్ట్ ఫిలిమ్ చిత్రపురి, అనంత ఫిలిం ఫెస్టివల్స్‌లో అవార్డులు కైవసం చేసుకుంది. దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్‌కు కూడా ఎంపికైంది. ఈ లఘు చిత్రానికి దర్శకత్వం వహించిన చంద్రకాంత్‌ను బీఆర్ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవిత ట్విట్టర్ ద్వారా ప్రత్యేకంగా అభినందించారు. రావుగారి పిల్ల, జ్ఞాపకం షార్ట్‌ఫిలిమ్స్ కూడా ప్రశంసలు తెచ్చిపెట్టాయి.

సినీ 'సేద్యం' ప్రారంభం

షార్ట్ ఫిలిమ్స్ ద్వారా ప్రతిభావంతుడిగా గుర్తింపు తెచ్చుకున్న చంద్రకాంత్ 'సేద్యం' ద్వారా సినీ ఎంట్రీ ఇచ్చారు. రాయలసీమ రైతుల స్థితిగతులను ప్రత్యక్షంగా చూసిన చంద్రకాంత్ వాటిని ఇతివృత్తంగా తీసుకుని 'సేద్యం' కథ రూపొందించాడు. అది నచ్చడంతో ధర్మవరానికి చెందిన గోరకాటి మహేష్‌రెడ్డి, గాజుల పద్మావతి జీపీఆర్ ప్రొడక్షన్ బ్యానర్ కింద సినిమా నిర్మించడానికి ముందుకు వచ్చారు. ఉమ్మడి జిల్లాకే చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఛాయాగ్రాహకుడిగా తెరకెక్కిన ఈ సినిమా చిత్రీకరణ మొత్తం రాప్తాడు, బుక్కచెర్ల, పుట్టపర్తి, ధర్మవరం, సిద్ధరాంపురం, ఆత్మకూరు, ఎన్ఎస్ గేటు , సోములదొడ్డి, గార్లదిన్నె ప్రాంతాల్లో పూర్తి చేశారు. నటీనటులుగా ఎక్కువ మందికి ఉమ్మడి అనంతపురం జిల్లావాసులకే అవకాశం కల్పించారు. నేపథ్య సంగీతం అరుణ్ కీస్, కొరియోగ్రఫీ వినోద్ జీ అందించారు. వీరూ 'అనంత' వాసులే.

విడుదలకు ముందే అవార్డుల పంట..

'సేద్యం' సినిమా విడుదలకు ముందే అవార్డుల పంట పండిస్తోంది. ఏ ఫిలిమ్ ఫెస్టివల్‌కు వెళ్లినా అవార్డుతో తిరిగొస్తోంది. ఇప్పటికే ఐఎఫ్ఎంఏ విశాఖ, సిత్తనవసల్, డెక్కన్ ఇంటర్నేషనల్, ఇండో–ఫ్రెంచ్, తామిజంగం ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అవార్డులు కైవసం చేసుకుంది. రైతన్నల కష్టనష్టాలను చక్కగా చిత్రీకరించిన దర్శకుడు చంద్రకాంత్‌ను సినీ విమర్శకులు సైతం అభినందించారు.

సందేశాత్మక చిత్రాలు తీయడమే లక్ష్యం

సామాజిక అంశాలపై స్పందించి..సందేశాత్మక చిత్రాలు తీయడమే నా లక్ష్యం. నా షార్ట్ ఫిలిమ్‌లు కూడా ఇదే తరహాలో ఉంటాయి. త్వరలో విడుదల కానున్న 'సేద్యం' సినిమా రైతన్నల జీవన విధానాన్ని, ఇబ్బందులను ప్రతిబింబిస్తుంది. ఈ సినిమాకు విడుదలకు ముందే పలు అవార్డులు,ప్రశంసలు లభించడం ఆనందంగా ఉంది.

– చంద్రకాంత్ పసుపులేటి, సినీ దర్శకుడు

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

బెళుగుప్ప: మండల కేంద్రంలో ఎక్కేల వంశస్తులు నూతనంగా నిర్మించిన బెళగలేశ్వరస్వామి ఆలయంలో బెళగలేశ్వర స్వామి, యల్లమ్మ దేవత విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజామున 4.35 గంటలకు వేద పండితులు రామకృష్ణాచారి, కర్నూలు వనం మల్లికార్జునశర్మ బృందం ఆధ్వర్యంలో విశేష పూజలు, కలశ స్థాపనలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వ్యవసాయ మిషన్ సభ్యుడు రాజారాం పాల్గొన్నారు. బెళుగుప్ప సహకార సంఘం అధ్యక్షుడు శివలింగప్ప, శ్రీరంగాపురం ఎంపీటీసీ వరలక్ష్మి తదితరులు హాజరయ్యారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

అనంతపురం: వేసవి సెలవులను వృథా కానివ్వకుండా విద్యార్థులకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. సోమవారం నుంచి జూన్ 11వ తేదీ వరకూ 35 రోజుల పాటు వేసవి విజ్ఞాన శిబిరాలు ఉంటాయన్నారు. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ వివిధ అంశాలపై విద్యార్థులు పట్టు సాధించేలా పలు కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు వివరించారు. బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, పుస్తక సమీక్ష, డ్రాయింగ్, ఆటలు తదితరాలతో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

ఆటో బోల్తా... 8 మందికి గాయాలు

రాయదుర్గంటౌన్: స్థానిక బీటీపీ రోడ్డులోని ఈశ్వరమ్మ ఆలయం వద్ద ప్రయాణికులతో వెళుతున్న ఓ ఆటో బోల్తాపడింది. ఘటనలో 8 మంది గాయపడ్డారు. మండల కేంద్రమైన బ్రహ్మసముద్రం నుంచి రాయదుర్గానికి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులంతా బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట, కర్ణాటక ప్రాంతానికి చెందిన వారు. గాయపడిన వారిలో కిష్టప్ప, ఫకృద్దీన్, రుద్రేష్, నీలమ్మ, తిప్పేస్వామి, పార్వతి, హుస్సేన్, నవీన్ ఉన్నారు. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న కిష్టప్ప, ఫకృద్దీన్, రుద్రేష్‌ను వైద్యుల సూచన మేరకు అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి దుర్మరణం



మృతుడు గణేష్

మడకశిర రూరల్: లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గుడిబండ మండలం ఎస్ఎస్ గుండ్ల గ్రామానికి చెందిన గణేష్ (40), లలితమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆదివారం ఉదయం వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనంపై మడకశిరకు బయలుదేరిన గణేష్‌ను యు.రంగాపురం వద్ద రోడ్డు మలుపులో వేగంగా దూసుకొచ్చిన సిమెంట్ మిక్సింగ్ లారీ ఢీకొంది. ఘటనలో గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఆత్మకూరులో ఘరానా మోసం



ఆత్మకూరు: సైబర్ నేరగాళ్లు కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. వారి మాయమాటలకు ఆత్మకూరుకు చెందిన పలువురు మోసపోయారు. వివరాలు... ఆత్మకూరులోని ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాల నిర్వాహకులను సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేశారు. దుకాణాల బోర్డుపై ఉన్న నంబర్లకు మూడు రోజులుగా 7795821895 నంబర్ నుంచి ఫోన్ చేస్తూ తమది ఆత్మకూరు మండలంలోని యాలేరు గ్రామమని, బెంగళూరులో స్థిరపడాలని ఇల్లు మారుతున్నట్లు పరిచయం చేసుకున్నారు. తమ వద్ద 55 ఇంచుల సోనీ టీవీ, ఓ ఇన్వర్టర్, బ్యాటరీ, వాషింగ్ మిషన్, ఇతర విలువైన ఎలక్ట్రిక్ సామగ్రి ఉందని, రూ.20 వేలు ఇస్తే వాటిని అందజేస్తామని నమ్మబలికారు. కొందరు ఈ ఆఫర్‌ను తిరస్కరించారు. మరి కొందరు అత్యాశకు వెళ్లి సామగ్రి తీసుకువస్తే నగదు చెల్లిస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఓ మహిళకు ఫోన్ చేసి, వాట్సాప్ ద్వారా ఫొటోలు పంపారు. వాటిని చూసిన ఆమె వారి ఖాతాకు ఫోన్ పే ద్వారా రూ.21 వేలు బదిలీ చేసింది. అనంతరం ఇంటికి వచ్చిన భర్తకు విషయాన్ని తెలిపింది. దీంతో ఆయన ఫోన్‌లో అవతలి వ్యక్తితో మాట్లాడారు. మరి కాసేపట్లో సామగ్రి తీసుకుని వస్తున్నట్లు తెలిపిన అవతలి వ్యక్తి ఆ తర్వాత తన సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో మోసపోయినట్లు తెలుసుకున్న బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై పలువురు స్పందించారు. తమకు కూడా ఇలాంటి కాల్స్ వస్తున్నాయని వివరించారు.

మెగా పీపుల్స్ సర్వేలో 'అనంత'కు ప్రథమ స్థానం

- జిల్లా అధ్యక్షున్ని సన్మానించిన అనుబంధ సంఘాల అధ్యక్షులు



పైలా నరసింహయ్యను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: అధిష్టానం పిలుపు మేరకు జిల్లాలో వైఎస్సార్‌సీపీ నాయకులు చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం విజయవంతమైంది. మెగా పీపుల్స్ సర్వేలో రాష్ట్రంలోనే అనంతపురం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైలా నరసింహయ్యను ఆ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలో పైలా నరసింహయ్య మాట్లాడుతూ... రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగిస్తుందన్నారు. జగనన్నే భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గృహ సారథులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. మొత్తం 7,69,581 ఇళ్లను సందర్శించి ప్రభుత్వం చేసిన మేలు, గత టీడీపీ ప్రభుత్వ నయవంచక పాలనపై ప్రజలను చైతన్య పరిచినట్లు వివరించారు. దీంతో .జగన్ సర్కార్‌పై విశ్వాసం ప్రకటిస్తూ 5,33,131 గృహాల నుంచి 82960 82960కు మిస్‌డ్ కాల్స్ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు, అనుబంధ సంఘాల అధ్యక్షులు కొర్రపాడు హుస్సేన్‌పీరా, సైఫుల్లాబేగ్, శ్రీదేవి, ఎగ్గుల శ్రీనివాసులు, ఎం రంగనాథరెడ్డి, ఎన్‌వీ నారాయణ, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ యాదవ్, జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు, నాయకులు జావేద్, రాధాయాదవ్, శోభాబాయి, భారతి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల ఎన్నికలు ప్రశాంతం

- ఉదయం 7 గంటలకే మొదలైన పోలింగ్ ప్రక్రియ



ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో వేచి ఉన్న ఉద్యోగులు

అనంతపురం సిటీ: తపాలా ఉద్యోగుల పరస్పర సహకార సంఘం (కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ) ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఆదివారం నిర్వహించిన పోలింగ్ ఘట్టం సాధారణ ఎన్నికలను తలపించింది. అనంతపురంలోని ఆదిమూర్తి నగర్‌లో ఉన్న గిల్డ్ ఆఫ్ సర్వీస్ బాలికల పాఠశాలలో పోలింగ్ నిర్వహించారు. మొత్తం 11 డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా, రెగ్యులర్ ఉద్యోగులకు తొమ్మిది స్థానాలు, జీడీఎస్ ఉద్యోగులకు రెండు స్థానాలు కేటాయించారు. రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. భారీ పోలీస్ బందోబస్తు మధ్య ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ మొదలైంది. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన తపాలా ఉద్యోగులు భారీగా తరలివచ్చారు. ఎన్నికల అధికారి ఎస్.కుమార్ పర్యవేక్షణలో పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. సాయంత్రం నుంచి ఓట్ల లెక్కింపు మొదలైంది.

విజేతలు వీరే..

- రెగ్యులర్ ఉద్యోగుల విభాగం నుంచి తొమ్మిది స్థానాలకు 18 మంది పోటీ పడ్డారు. 488 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా, 46 ఓట్లు చెల్లకుండాపోయాయి. గెలుపొందిన వారిలో కె.గణేనాయక్, పీఎస్ఆర్‌కే ప్రసాద్, బి.హర్షవర్ధన్‌రెడ్డి, పెండ్యాల విశ్వనాథ్, ఎ.విశ్వనాథరెడ్డి, బి.నవీన్‌కుమార్, ఎస్‌కే మహేష్‌గౌడ్, బి.మంజునాథ్, బి.నరేంద్రనాథరెడ్డి ఉన్నారు.
- బీడీఎస్ ఉద్యోగులకు కేటాయించిన రెండు డైరెక్టర్ స్థానాలకు నలుగురు పోటీ పడ్డారు. వీరిలో కె.సూర్యనారాయణరెడ్డి, బి.నాగభూషణం గెలుపొందారు. మొత్తం 471 ఓట్లు రాగా, 18 ఓట్లు చెల్లకుండాపోయాయి. విజేతలకు ఎన్నికల అధికారి ఎస్.కుమార్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

10న అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి ఎన్నిక ..

11 డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గెలుపొందిన డైరెక్టర్లలోనే ముగ్గురిని అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శిని ఎన్నుకోవాల్సి ఉంటుందని ఎన్నికల అధికారి కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఈ నెల 10న ఎన్నిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 11.30 గంటలకు పరిశీలన, 12 నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోపు ఉపసంహరణ ప్రక్రియలు ఉంటాయని వివరించారు. అదే రోజు మధ్యాహ్నం 2.30కు తుది జాబితా ప్రకటించి, 3 నుంచి 5 గంటల వరకు పోలింగ్, ఆ వెంటనే ఓట్ల లెక్కింపు, విజేతల ప్రకటన ఉంటుందన్నారు.

మె.. తో కొడతా కొడకా!

- హౌసింగ్ ఏఈని ఫోన్‌లో బండబూతులు తిట్టిన టీడీపీ సర్పంచ్

నల్లమాడ: మండల హౌసింగ్ ఏఈ వరుణ్‌పై పులగంపల్లి గ్రామ సర్పంచ్ (టీడీపీ) ప్రభాకరరెడ్డి బండ బూతులతో విరుచుకుపడ్డాడు. అసభ్య పదజాలంతో తన అక్కసు వెళ్లగక్కాడు. ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. వివరాలు... శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో ఏఈ వరుణ్‌కు సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి ఫోన్ చేసి తన పంచాయతీ పరిధిలో తనకు తెలియకుండా హౌసింగ్ బిల్లులు ఎలా చేస్తావంటూ నిలదీశాడు. దీనిపై ఏఈ మాట్లాడుతూ.. ఇల్లు కట్టుకున్నవారికే బిల్లులు చేసినట్లు వివరించారు. ఇల్లు కట్టకపోయినా.... ఇల్లు కట్టుకున్నట్లు బిల్లు చేసి ఉంటే కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తామని సూచించారు. దీంతో రెచ్చిపోయిన సర్పంచ్... 'నేను మీ ఆఫీస్‌కు రావాలేరా బొసిడీకే.. నువ్వేమైనా సుపీరియర్ అనుకుంటున్నావా? తమషా చేస్తావా? మె.. తో కొడతా... కొడకా. ఎవడికి చెప్పుకుంటావో చెప్పుకో. కాల్ రికార్డు చేసుకుని కలెక్టర్‌కు పెట్టుకోరా. ఏమైతాది. నీ కథ చూస్తా. రెన్నాళ్లుండు' అంటూ విరుచుకుపడ్డాడు. ఘటనపై ఆదివారం ఉదయం పోలీసులకు బాధితుడు వరుణ్ ఫిర్యాదు చేశారు.

బసవనపల్లిలో విషాదం

- వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి
- భూతప్ప ఉత్సవాలు చూసేందుకు వచ్చి అకాల మృత్యువాత

అమరాపురం: మండలంలోని బసవనపల్లిలో విషాదం నెలకొంది. భూతప్ప ఉత్సవాలను చూసేందుకు వచ్చిన ఇద్దరు కర్ణాటక వాసులు వేర్వేరు ఘటనల్లో మృతి చెందారు. ప్రమాదవశాత్తు చెరువు నీటిలో పడి ఒకరు మృతిచెందగా... విషపురుగు కాటుతో మరో యువతి ప్రాణాలు కోల్పోయింది. పోలీసులు తెలిపిన మేరకు... బెంగళూరుకు చెందిన కాంతరాజు (29) టెంపో ట్రావెల్స్ వాహనం ఏర్పాటు చేసుకుని డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. బెంగళూరులో ఉద్యోగాలు చేస్తున్న బసంపల్లి వాసులు పలువురు టెంపో ట్రావెల్స్‌ను అద్దెకు మాట్లాడుకుని శనివారం ఉదయం స్వగ్రామంలో జరుగుతున్న భూతప్ప ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చారు. ఆదివారం ఉదయం తన స్నేహితుడితో కలసి సమీపంలోని చెరువు కట్ట వద్దకు చేరుకున్న కాంతరాజు... ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడ్డాడు. ఈత రాక నీట మునగడంతో స్నేహితుడి కేకలతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే చెరువులో దూకి కాంతరాజును వెలికి తీసి, వెంటనే గుడిబండ పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

విషపురుగు కాటుతో...

కర్ణాటకలోని శిరా తాలూకా కాటనహళ్లికి చెందిన భూతప్ప కుమార్తె శ్రీదేవి (24) ఇటీవల తల్లిదండ్రులతో కలసి అమరాపురం మండలం బసవనపల్లిలోని అమ్మమ్మ ముద్దీరమ్మ ఇంటికి వచ్చింది. శనివారం రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం అందరూ ఇంటి ఆవరణలో పడుకున్నారు. తెల్లవారుజామున ఎడమ చేతి వేలికి ఏదో కాటు వేసినట్లుగా అనిపించడంతో నిద్ర మేల్కొన్న శ్రీదేవి.. విషయాన్ని తన తల్లి భాగ్యమ్మకు తెలిపింది. వెంటనే కుటుంబసభ్యులు ఆమెను గుడిబండ పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచనమేరకు మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో గౌరిబిదనూరుకు చేరుకోగానే పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో అక్కడి ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందేలోపు ఆమె మృతి చెందింది. ఘటనపై భూతప్ప ఫిర్యాదు మేరకు అమరాపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

సత్ప్రవర్తనతో మెలగండి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

రాప్తాడు: శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి హెచ్చరించారు. ఆదివారం రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో ప్రసన్నాయపల్లి, గొందిరెడ్డిపల్లి, పుల్లలరేవు, హంపాపురం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో మార్పురావాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలతో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. భార్యా పిల్లలు, కుటుంబ సభ్యుల కోసం కష్టపడాలని, ఎవరి కోసమో ఘర్షణలకు దిగి, కుటుంబాలకు దూరమై శిక్ష అనుభవించాల్సిన పరిస్థితి తెచ్చుకోరాదన్నారు. ఫ్యాక్షన్‌లో కూరుకుపోయి జైలు పాలైన వారి నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలన్నారు. రౌడీషీటర్లపై నిత్యం నిఘా ఉంచామని, బుద్ధిగా మసలుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 110 మంది ఎంపిక

అనంతపురం కల్చరల్: లయన్స్‌క్లబ్ అనంతపురం మెయిన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 110 మందికి ఉచిత ఆపరేషన్లు చేయిస్తున్నట్లు నిర్వాహకులు లక్ష్మీనారాయణ, ఆసీఫుద్దీన్, నబీరసూల్ తెలిపారు. స్థానిక గిల్డ్ ఆఫ్ సర్వీసు పాఠశాలలో ఉదయం జరిగిన వైద్య శిబిరానికి 225 మంది హాజరయ్యారు. డాక్టర్ శివప్రకాష్ వైద్య బృందం పరీక్షలు చేశారు. వచ్చేనెల మొదటి ఆదివారం మరోసారి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. లయన్స్‌క్లబ్ సభ్యులు ఉమామహేశ్వరి, నందిత తదితరులు పాల్గొన్నారు.

కార్తికేయునికి పంచామృతాభిషేకాలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: పంపనూరు గ్రామంలోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేషపూజలు జరిగాయి. స్వామికి రాహుకేతు హోమాలు, పల్లకీ సేవ, ఆకుపూజ, కుజదోష, కాలసర్పదోష నివారణకు మూలమంత్ర భీజాక్షర హోమం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు చేశారు. ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతిదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.


పాటల పోటీలకు స్పందన



గానం చేస్తున్న చిన్నారి

అనంతపురం కల్చరల్: అనంత సూపర్ సింగర్-23 కార్యక్రమానికి స్పందన లభించింది. ఆదివారం స్థానిక లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో అనంత సింగర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాయనీ గాయకుల ఎంపిక జరిగింది. జిల్లా వ్యాప్తంగా 70 మంది ఔత్సాహిక గాయనీగాయకులు పోటీలో పాల్గొన్నారు. సంగీత విద్వాంసులు మాధవి, శ్రీదేవి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. నిర్వాహకులు సపారె రాజశేఖర్ మాట్లాడుతూ ఔత్సాహిక గాయకులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో పాటల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 14న మరోసారి మలిదశ ఎంపిక జరుగుతుందన్నారు.

చింతలరాయుడిని దర్శించుకున్న జడ్జి



జడ్జి శ్రీలతకు స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న అర్చకులు

తాడిపత్రి అర్బన్: ప్రసిద్ధ చింతల వెంకటరమణ స్వామిని ఆదివారం జిల్లా వినియోగదారుల ప్రత్యేక కోర్టు జడ్జి శ్రీలత, చిత్తూరు జిల్లా కోర్టు అడ్మిన్ ఏఓ ప్రసన్నకుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు బాణా నాగేశ్వర్‌రెడ్డి, అర్చకులు మురళీబట్టార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలోని శిల్పకళ, ఆలయ చరిత్రను, ప్రాశస్త్యాన్ని అర్చకులు మురళీబట్టార్ వివరించారు.

నాలుగేళ్ల అభివృద్ధి కనిపించలేదా?

- ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సొంత డబ్బుతో అభివృద్ధి చేశారు
- పరిటాల కుటుంబం అక్రమార్జనతో రూ.కోట్లకు పడగలెత్తింది
- తీవ్ర స్థాయిలో మండిపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

ఆత్మకూరు: రాప్తాడు నియోజకవర్గంలో నాలుగేళ్లుగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి టీడీపీ నాయకులకు, పరిటాల కుటుంబానికి కనిపించడం లేదా అని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. ఆదివారం ఆత్మకూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీలు విజయ్‌కుమార్, నీలిమ, సర్పంచ్ వరలక్ష్మి , వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడారు. పరిటాల కుటుంబం పాతికేళ్లుగా కుట్రలు, కుతంత్రాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, హత్యా రాజకీయాలకు పాల్పడిందని, అవినీతి అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు కూడబెట్టిందని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, డ్వాక్రా, వ్యవసాయ, బంగారు రుణాల మాఫీ, నిరుద్యోగ భృతి తదితర అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ.. ఏ ఒక్కటీ నెరవేర్చకుండా నిలువునా మోసం చేసిందన్నారు. హామీలు నెరవేర్చకపోగా.. ప్రజల అవసరాలను, నియోజకవర్గ అభివృద్ధిని ఏనాడూ పరిటాల కుటుంబం పట్టించుకోలేదని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రజలకు సేవ చేస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. ప్రభుత్వ నిధులే కాకుండా అవసరమైన చోట తన సొంత ఖర్చుతో సైతం అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల మన్ననలు పొందారన్నారు. జనరంజక పాలన సాగిస్తున్న జగనన్నను, ప్రజాసేవలో దూసుకుపోతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని చూసి టీడీపీ నేతలు - పరిటాల కుటుంబీకులు ఓర్వలేక దుష్ప్రచారానికి దిగుతున్నారన్నారు. మేనిఫెస్టోలోని అంశాలన్నింటినీ నెరవేర్చడమే కాకుండా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన అభివృద్ధి పనులు చేపడుతున్న ఎమ్మెల్యేపై అవాకులు చెవాకులు పేలుతూ 'పచ్చ' మీడియాలో అసత్య కథనాలు రాయిస్తున్నారని పరిటాల కుటుంబంపై మండిపడ్డారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో రూ.2వేలకోట్ల డిపాజిట్‌దారుల సొమ్మును చంద్రబాబు-రామోజీరావు స్వప్రయోజనాలకు వాడుకుని, పదేళ్ల తర్వాత డిపాజిట్‌దారులకు వడ్డీలు ఎగ్గొటి ఇబ్బంది పెట్టారని ఆరోపించారు.

రూ.వేల కోట్లు ఎలా వచ్చాయి?

రాజకీయాల్లోకి రాకముందు ఐదు ఎకరాల భూమి మాత్రమే ఉన్న పరిటాల కుటుంబానికి నేడు రూ.2వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అక్రమ సంపాదన కోసం వెంపర్లాడకుండా ప్రజా ప్రయోజనాల కోసం పాకులాడారన్నారు. రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రకాష్‌రెడ్డి రూ.6 కోట్లు వెచ్చించి రైతులకు ఉచితంగా బోర్లు వేయించారన్నారు. పేరూరు డ్యాంకు నీళ్ల తెప్పించడంతో పావగడ, కల్యాణదుర్గం, కంబదూరు, రొద్దం, రామగిరి, కనగానపల్లి, ఆత్మకూరు, రాప్తాడు చుట్టూ దాదాపు 60 కిలో మీటర్లు భూగర్భజలాలు పెరిగాయన్నారు. 40 కిలో మీటర్ల మేర కాలువలు సైతం తీయించారన్నారు. నీటి పారకంతో ఇక్కడ భూమి ధరలు కూడా పెరిగాయన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధికి రూ.1,700 కోట్లు ఖర్చుపెట్టారన్నారు. 25 వేల జగనన్న ఇంటి నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ట్రస్ట్ ద్వారా కూడా రూ.కోట్లు వెచ్చిస్తున్నారన్నారు. దాదాపు రూ.15 కోట్లతో మహిళా సహకార డెయిరీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మసీదులు, ఆలయాల అభివృద్ధికి సొంత డబ్బులు వెచ్చిస్తున్న ఎమ్మెల్యేను విమర్శించడం దారుణమన్నారు. పరిటాల సునీత ఎన్నికల్లో ఓడిపోవడంతో మతిభ్రమించి మాట్లాడటమే కాకుండా.. కార్యకర్తలతో ఇష్టారాజ్యంగా ఎమ్మెల్యేపై విమర్శలు చేయిస్తోందని ధ్వజమెత్తారు. ఎవరు ఏమి చేశారనేది ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, 2024 ఎన్నికల్లో సరైన తీర్పు ఇస్తారన్నారు. సమావేశంలో తోపుదుర్తి సర్పంచ్ ఓబులేష్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వాసుదేవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు గోపాల్‌రెడ్డి, నాగరాజ్, ఈశ్వరరెడ్డి, వన్నూరప్ప, ఎర్రిస్వామి, రామాంజి పాల్గొన్నారు.

సేవా దృక్పథం అభినందనీయం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



చిన్నారికి స్వీటు తినిపిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం క్రైం: డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్ సేవా దృక్పథం అభినందనీయమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని గఫూర్ కాలనీలో ఉచిత ఖత్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను కొనసాగించాలన్నారు. డాక్టర్ కేఎస్ఆర్ గఫూర్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్ మాట్లాడుతూ ఏటా మైనార్టీ పిల్లలకు ఉచిత ఖత్నా కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 250 మంది పిల్లలు ఖత్నా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వసీం, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైద్యులు డాక్టర్ కేఎస్ అర్షద్ అయూబ్ గఫూర్, రచయిత సంఘం సభ్యులు కంబదూరి నబీరసూల్, ఇస్లామిక్ కమిటీ సభ్యులు ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.

పురవీధుల్లో వీరభద్రస్వాముల సందడి



సందడి చేస్తున్న వీరభద్రస్వామి వేషధారులు

అనంతపురం కల్చరల్: కర్ణాటక నుంచి తరలి వచ్చిన కళాకారులు వీరభద్రుడి వేషధారణతో అలరించారు. శివతాండవం చేస్తూ శివస్తుతితో ఖడ్గాలను, నందికోలును లయబద్ధంగా తిప్పుతూ సాగిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం నగర శివారులో భారీ ఊరేగింపు జరిగింది. ఆకుతోటపల్లి గ్రామంలో ఉదయం ప్రాచీన బసవేశ్వరస్వామి దివ్య ఆలయం యంత్ర ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలు, ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ప్రధాన అర్చకులు రాజేష్‌స్వామి, ఇతర పండితులు ఆలయంలో రెండు రోజులుగా సాగిన హోమాన్ని పూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ముగించారు. మధ్యాహ్నం వేలాది మందికి అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ఈవో రామాంజనేయులు, కమిటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు వేసవి వినోదం అత్యవసరం

- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

అనంతపురం కల్చరల్: సంవత్సరమంతా కష్టపడి చదువుతో కుస్తీపడే చిన్నారులకు ఆటపాటలు, వేసవి వినోదం అత్యవసరమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. ఆదివారం గనేనాయక్ భవన్‌లో ఈనెల 20 వరకు నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం గేయానంద్ మాట్లాడుతూ సమాజంపై అవగాహన, చుట్టుపక్కల జరిగే విషయాలపై కనీస స్పృహ పెంచుకునేందుకు ఇలాంటి శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. చిల్డ్రన్స్ క్లబ్ నిర్వాహకులు నరసింహ,కో కన్వీనర్ కృష్ణవేణి మాట్లాడుతూ పిల్లల్లో ఉండే నైపుణ్యాలను వెలికితీయడానికి 20 అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు గోవిందరాజులు, రమణయ్య, విజ్ఞాన కేంద్రం కన్వీనర్ శ్రీనివాసరావు, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యులకు సన్మానం



కమిటీ సభ్యులను సత్కరిస్తున్న పోలేపల్లి నాగరాజు

అనంతపురం కల్చరల్: నగరంలోని సూర్యానగర్ మల్లాలమ్మ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఆలయ కమిటీ సభ్యులను ఆదివారం సన్మానించారు. ఇటీవల రథసేవ జరపడంపై జిల్లా మేదర సంఘం అధ్యక్షుడు పోలేపల్లి నాగరాజు 31 మంది సభ్యులను, దాతలను సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు సూర్యనారాయణ, వెంకట మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు నేర్పాలి



స్వామీజీతో శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: విద్యార్థులకు నైతిక విలువలు నేర్పాలని, అప్పుడే మంచి సమాజాన్ని నిర్మించగలుగుతామని స్వామి ఆత్మవిదానంద సరస్వతి అన్నారు. పట్టణ అవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో సరస్వతి శిశు మందిరంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం సాయంత్రం విద్యార్థులకు సామాజిక బాధ్యత, నైతిక విలువలపై అవగాహన సదస్సు జరిగింది. చిన్మయా మిషన్ స్వామీజీతో పాటు నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు డాక్టర్ నిర్మల, ఇంపాక్ట్ సంస్థ ట్రైనర్ శ్రీనివాసరెడ్డి, అవోపా అధ్యక్షులు జయంతి శ్రీనివాసులు తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అవోపా గౌరవాధ్యక్షుడు చంద్రమోహనుగప్తా, సభ్యులు పాల్గొన్నారు.

అల్లూరిని స్ఫూర్తిగా తీసుకోవాలి



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు, ప్రజలు

అనంతపురం అర్బన్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటం నేటి యువతకు స్ఫూర్తి అని డీవైఎఫ్‌ఐ నాయకులు అన్నారు.ఆదివారం స్థానిక సీపీఎం కాలనీలో అల్లూరి వర్ధంతిని డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా గిరిజన బిడ్డలను ఐక్యం చేసి పోరాటం సాగించిన గొప్ప వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఆయన చూపిన పోరాట స్ఫూర్తితో సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, ప్రజలు ఎదర్కొంటున్న సమస్యలపై యువత పోరాటం సాగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాశ్‌రెడ్డి, శివ, మోహన్, వలి, విజయ్, కాలనీవాసుల పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య వర్ధంతి



సంజీవయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: 'ఆలిండియా షెడ్యూల్డ్ కులాలు, తెగలు, బ్యాక్ వర్డ్ క్లాసెస్ అండ్ మైనార్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ (ఎస్సీఈడబ్ల్యూఏఎస్‌టీఏఎంబీ) ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు వంకరాజు కాల్వ గోవిందరాజులు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్లు ఎ.గోవిందు, సి. మల్లికార్జున, జిల్లా సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు వలిగొండ రామకృష్ణ, ఎం.జయరాముడు, వైస్ ప్రెసిడెంట్ కోటి మల్లేషు, వై. భైరవ కుమార్, సాకే వెంకట రమణ, యస్.మహమ్మద్ రఫీ, బి. లక్ష్మీదేవి పాల్గొన్నారు.

క్రికెట్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోండి



క్యాంపును ప్రారంభిస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, డిప్యూటీ మేయర్, ఏడీసీఏ కార్యదర్శి

రాప్తాడురూరల్: ఉచిత క్రికెట్ కోచింగ్ క్యాంపును క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి కోరారు.ఆదివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ నెట్స్‌ను ప్రారంభించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, ఏడీసీఏ కార్యదర్శి మధుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం కోగటం మాట్లాడుతూ టీడీ చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంతోమంది క్రికెట్ క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచారన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల పీడీ జబీవుల్లా, కోచింగ్ క్యాంపు నిర్వాహకులు టీడీ చంద్రమోహన్‌రెడ్డి, ఆర్డీటీ క్రికెట్ కోచ్ యుగంధర్‌రెడ్డి, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల పీడీ వాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు యోగి రాయల్ పాల్గొన్నారు.

సంగీతం భగవత్ సేవతో సమానమే

- చిన్మయామిషన్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి



మాట్లాడుతున్న ఆత్మవిదానంద సరస్వతి, సంధ్యామూర్తి తదితరులు

అనంతపురం కల్చరల్: సంగీత సాధన, శ్రవణం భగవత్ సేవతో సమానమేనని చిన్మయామిషన్ జిల్లా ఇన్‌చార్జ్ స్వామి ఆత్మ విదానంద సరస్వతి అన్నారు. ఆదివారం స్థానిక మూడో రోడ్డులోని ఘంటసాల భవన్‌లో నిర్వహించిన సంగీత సత్సంగం ఆకట్టుకుంది. అనంత ఘంటసాల ఆరాధన సమితి అధ్యక్షుడు పాలసముద్రం నాగరాజు నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి స్వామీజీతో పాటు ప్రముఖ సంగీత, నాట్య కోవిదులు సంధ్యామూర్తి ఆత్మీయ అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు బాలనిఖిత, డాక్టర్ కట్టా జీవన్, నాగమణి దంపతులు, బృందామూర్తి, శ్రీదేవి, పద్మ, ఆచార్య సుధాకరబాబు, రవికుమార్ తదితరులు ఆలపించిన పాత సినిమా పాటలు అమితంగా అలరించాయి. ప్రభుత్వ ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ వేణుగానం, పాలసముద్రం నాగరాజు భగవద్గీత శ్లోకాల ఆలాపన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆరాధన సమితి గౌరవాధ్యక్షులు రామయ్య, మల్లికార్జున, ఆదినారాయణ, తపోవనం మురళీ తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం



ఖాళీ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న మహిళలు

రాప్తాడురూరల్: గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాప్తాడు నియోజకవర్గ గౌని శారద అన్నారు. అనంతపురం రూరల్ మండలం ఇంద్రజిత్ గుప్తా నగర్‌లో స్థానిక నాయకురాలు టి.సుధామణి ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలియజేశారు. గౌని శారద మాట్లాడుతూ పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు గ్యాస్ ధర రూ. 400 ఉంటే, ప్రస్తుతం రూ. 1,200 చేరిందన్నారు. అధికారంలోకొస్తే నిత్యావసరాల ధరలు తగ్గిస్తామని చెప్పి మోసగించిందన్నారు. పెంచిన గ్యాస్ ధర రూ. 500కు తగ్గించాలని, లేని పక్షంలో గత పాలకులకు పట్టిన గతే బీజేపీకి పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాళ్లు లక్ష్మీదేవి, వరలక్ష్మి, సుధామణి, చౌడమ్మ, కై రున్‌బి, లక్ష్మీదేవి, ఎల్లమ్మ, పెద్దక్క, మాలతి, పద్మావతి, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

ఆత్మకూరు: స్థానిక జెడ్పీహెచ్ఎస్ క్రీడామైదానంలో సోమవారం నుంచి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల టెన్నిస్ బాల్ ఆధార్‌కార్డు మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. 15 మంది క్రీడాకారులు ఒకే గ్రామానికి చెందిన వారై, టీముగా ఉండాలన్నారు. మొదటి బహుమతి రూ. లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు, మూడు, నాల్గో బహుమతిగా కప్పులు అందచేస్తున్నట్లు తెలిపారు.

13న రాష్ట్ర స్థాయి తాళాల భజన పోటీలు

గార్లదిన్నె: ముకుందాపురంలో ఈనెల 13న హనుమాన్ జయంతి సందర్భంగా తాళాల భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ శనివారం(12వ తేదీ) రాత్రి ఆంజనేయ స్వామి భజన మండలి, గ్రామపెద్దల సమక్షంలో పోటీలు ప్రారంభిస్తామన్నారు. తొలి మూడు స్థానాల విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలతోపాటు మరో 18 బృందాలకు నగదు బహుమతులు అందిస్తామన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు 7780341202, 9573437160 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రామగిరి: నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజల్లో ఉమ్మడి జిల్లా వాసులేకాక, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి, మొక్కులు తీర్చుకున్నారు.

పోతలయ్యస్వామి ఆలయంలో పూజలు

కనగానపల్లి: దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్యస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన కాపులు, భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు పోతలయ్యస్వామికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

నేటి నుంచి రక్షణ శుభవార్త సభలు

పామిడి: పట్టణ 44వ నంబర్ జాతీయ రహదారిపై హనుమాన్ లింకురోడ్డు సర్కిల్ సమీపాన ఉన్న మైదానంలో సోమవారం నుంచి మూడురోజులపాటు అందరికీ రక్షణ శుభవార్త సభలు నిర్వహించనున్నట్లు శాశ్వత కృపా మినిస్ట్రీస్ నిర్వాహకులు ప్రభాకర్ ఛార్లెస్, పీటర్ విజయ్, ప్రభాకర్ తెలిపారు. ఈమేరకు వారు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్య ప్రసంగీకులుగా గుంటూరు యూదా మినిస్ట్రీస్ పాస్టర్ నెహెమ్యా విచ్చేయనున్నట్లు తెలిపారు. రోజూ సాయంత్రం పూట జరిగే సభలకు క్రీస్తు విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

గొర్రెల కాపరి ఆత్మహత్యాయత్నం

పామిడి: మండలంలోని రామరాజుపల్లిలో గొర్రెల కాపరి ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామస్తుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన తలారి గంగప్ప కుమారుడు తలారి సుధాకర్ గొర్రెల కాపరిగా పని చేసేవాడు. అయితే గొర్రెలు కాసేందుకు సరిగా వెళ్లక పోవడంతో కుటుంబ సభ్యులు మందలించారు. మనస్తాపం చెందిన సుధాకర్ ఇంట్లోని విషద్రావకం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సుధాకర్‌ను హుటాహుటినా అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ అతని పరిస్థితి మెరుగుపడినట్లు సమాచారం. పామిడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఊరుదేవర

గుంతకల్లుటౌన్: జి.కొట్టాల గ్రామంలో ఆదివారం గంగమ్మ ఊరు దేవర ఘనంగా జరిగింది. అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ చింబిలి ప్రభావతి, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల ఇళ్లల్లో నిర్వహించిన పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలో ఇళ్లన్నీ బంధువులు, స్నేహితులతో కిటకిటలాడాయి. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రూరల్ పోలీసులు బందోబస్తు చేపట్టారు.

ముగిసిన సుడిబండి తిరునాల



అలంకరణలో సుంకులమ్మ, ముత్యాలయ్య విగ్రహాలు

పామిడి: రామరాజుపల్లిలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న సుడిబండి(బండిశిల) తిరునాల ఆదివారం ముగిసింది. గ్రామంలోని సుంకులమ్మ, ముత్యాలయ్య విగ్రహాలను శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామదేవరలో భాగంగా అతిథులను ఆహ్వానించి విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఆదివారం విలేకరులకు తిరునాల విశిష్టతను వివరించారు. సుంకులమ్మ, ము త్యాలయ్య రెడ్డి కులములోని గణేశం వంశంలో అక్కా తమ్ముళ్లుగా జన్మించారన్నారు. వారి మహిమలతో గ్రామం సస్యశ్యామలంగా విరాజిల్లుతోందన్నారు. దాదాపు రెండున్నర శతాబ్దాల నుంచి తిరునాల నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఏటా వైశాఖ మాసం రామరాజుపల్లి, కాశేపల్లి, గుత్తి అనంతపురం నడుమ ఐదురోజుల పాటు తిరునాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరునాల తొలిరోజు తమ గ్రామం నుంచి వెళ్లిన సుడిబండి ఐదు రోజుల తర్వాత తిరిగి రావడంతో తిరునాల ముగుస్తుందన్నారు.

ప్రగతి బాట పట్టిన 'అనంత'

అనంతపురం క్రైం: ప్రభుత్వం నగర అభివృద్ధికి చర్యలు చేపట్టింది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వివిధ ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు, కాలువలు, తదితర అభివృద్ధి పనులు చేపట్టింది. అందుకు ప్రతి సచివాలయ పరిధిలో రూ.20 లక్షలు చొప్పున కేటాయించిన విషయం విదితమే. అందులో భాగంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నియోజకవర్గంలోని 50 డివిజన్ల కార్యక్రమాన్ని దాదాపుగా పూర్తి చేశారు. 74 సచివాలయాల పరిధిలో రూ.13.80 కోట్లతో 285 రోడ్లు, కాలువ, కమ్యూనిటీ హాల్, తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. అందులో 71 అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. కాగా 44 అభివృద్ధి పనులకు బిల్లులను అప్‌లోడ్ చేయగా, రూ.1.53 కోట్లు (రూ.1.53 కోటి) నిధులు విడుదలయ్యాయి. నిధులు విడుదల కావడంతో అభివృద్ధి పనులు మరింత వేగం పుంజుకునేలా చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు.

నేడు 'స్పందన'

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమం ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. నగర ప్రజలకు ఏమైనా సమస్యలుంటే స్పందన కార్యక్రమంలో తెలియజేయాలన్నారు.